

హైటెక్ బస్ బే

- లక్షల రూపాయల నిధులతో బస్ షెల్టర్ల ఆధునికీకరణ
- నగరవాసుల మది దోచేలా నిర్మాణం
- ప్రయాణికుల కోసం ప్రత్యేక సౌకర్యాలు

పరిపాలన రాజధాని కానున్న విశాఖ ప్రగతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. మహా విశాఖ అభివృద్ధి, సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోంది. ఇందులో భాగంగా స్మార్ట్ సిటీగా పేరొందిన విశాఖ నగరంలో అత్యాధునిక హంగులతో.. హైటెక్ లుక్‌తో స్మార్ట్ బస్ బేలు నిర్మించారు. ఆకర్షణీయమైన డిజైన్లలో ఆధునికీకరించిన బస్ షెల్టర్లు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



హైవేపై గురుద్వారా జంక్షన్ వద్ద ఆధునికీకరించిన బస్ బేలో వేచి ఉన్న ప్రయాణికులు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో ప్రయాణికుల కోసం విశాలమైన.. సౌకర్యవంతంగా ఉండేలా ఐదు బస్ బేలు నిర్మించారు. ప్రయాణికులు కూర్చునేందుకు పొడవైన గ్రానైట్ పలకలతో బెంచీలు, నడిచేందుకు ట్రాక్, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ విద్యుద్దీపాల వెలుగుల్లో బస్ బేలు మెరిసిపోతున్నాయి. వాటిని చూసి నగర ప్రజలు మురిసిపోతున్నారు.

నాడు అధ్వానం.. నేడు ఆకర్షణీయం

గత టీడీపీ ప్రభుత్వ హయంలో బస్ షెల్టర్ల దుస్థితి ఘోరంగా ఉండేది. వాటి అభివృద్ధి మాట అటుంచితే.. కనీసం బస్ షెల్టర్ల పరిస్థితి పట్టించుకునే నాథుడే ఉండేవాడు కాదు. చిన్న చిన్న బస్ షెల్టర్లు నిర్మించి నిధులు దుర్వినియోగం చేశారు. ప్రయాణికులు కనీస సౌకర్యాలకు నోచుకునే వారు కాదు. నాటి బస్ షెల్టర్లతో కుర్చీలు తుప్పుపట్టిపోయి కూర్చునేందుకు పనికిరాకుండా పోయాయి. చాలా షెల్టర్లు అధ్వాన స్థితికి చేరి నిరూపయోగంగా మిగిలాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ నగరం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. బస్ షెల్టర్ల రూపురేఖలను పూర్తిగా మార్చి.. ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆధునిక బస్ బేలుగా తీర్చిదిద్దారు. సాధారణ ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, శ్రామికులు ఇలా అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పోర్ట్ ఆస్పత్రి కూడలి వద్ద బస్ బే

ఆధునికంగా.. స్మార్ట్‌గా..

- గురుద్వారా కూడలి వద్ద జాతీయ రహదారిని అనుకొని సుమారు రూ.40 లక్షలతో బస్ బే నిర్మించారు.
- హైవేపై అక్కయ్యపాలెం కూడలి వద్ద రెండు వైపులా రూ.19.60 లక్షల చొప్పున అక్కయ్యపాలెం నార్త్, సౌత్ బస్ బేలు నిర్మించారు.
- పోర్ట్ ఆస్పత్రి కూడలి వద్ద నార్త్ రోడ్, సౌత్ రోడ్ వైపు మరో రెండు బస్‌బేలు నిర్మించారు. రూ.19.60 లక్షల చొప్పున ఖర్చు చేశారు.
- బస్ బేల పక్కన మహిళలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు నిర్మించారు.
- గ్రానైట్ వాల్స్, ఫ్లోరింగ్, బెంచీలు, ఎల్ఈడీ లైట్లు, డిజిటల్ బోర్డులు, బస్సుల రాపోకలకు వీలుగా విశాలమైన అప్రోచ్ రోడ్, పాత్‌వే నిర్మించారు. నగరాన్ని ఈ బస్ బేలు మరింత అందంగా మార్చాయి.

'నార్త్'లో ఐదు బస్ బేలు

గురుద్వారా జంక్షన్‌లో బస్ బే నిర్మాణ ఖర్చు
రూ.40 లక్షలు

అక్కయ్యపాలెం నార్త్ బస్ బే
రూ.19.60 లక్షలు

అక్కయ్యపాలెం సౌత్ బస్ బే
రూ.19.60 లక్షలు

పోర్ట్ హాస్పిటల్ సౌత్ ఎంటీసీ పాలెం బస్ బే
రూ.19.60 లక్షలు

పోర్ట్ హాస్పిటల్ నార్త్ కైలాసపురం బస్ బే
రూ.19.60 లక్షలు

సౌకర్యవంతంగా కొత్త బస్ బేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. నగర ప్రయాణికుల కోసం లక్షల రూపాయలతో బస్ బేలు నిర్మించడం శుభపరిణామం. గతంలో ఇటువంటి బస్ షెల్టర్లు లేవు. అన్ని సౌకర్యాలతోపాటు అత్యవసరానికి మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
– బి.లక్ష్మణరావు, కైలాసపురం


ప్రయాణికుల ఇబ్బందులు తొలగాయి



జీవీఎంసీ ఆధునికీకరించిన బస్ బేలతో ప్రయాణికులకు ఇబ్బందులు తొలగాయి. నూతన బస్ బేల వద్ద మరుగుదొడ్లు, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. లక్షలు రూపాయలు వెచ్చించి ఆధునిక బస్ బేలు నిర్మించడం అభినందనీయం. సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు.
– గేదెల రమేష్, సీతమ్మధార


ప్రయాణికుల బస్ బే వద్ద నిర్మించిన మరుగుదొడ్లు


గురుద్వారా జంక్షన్ బస్ బే వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



అక్కయ్యపాలెం హైవే వద్ద నూతనంగా నిర్మించిన స్మార్ట్ బస్ బే

క్లుప్తంగా

శివుడికి త్రయోదశి పూజలు


శివలింగానికి పూజలు చేస్తున్న రాజాస్వామి

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో శుక్రవారం త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఉదయం శివుడికి పంచామృతాభిషేకం, పాలు, గంధం, పళ్ల రసాలతో పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపారు. ప్రత్యేక అలంకరణలో శివయ్య భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

మద్రిపాలెం: తన భర్త తనను కులం పేరుతో దూషిస్తున్నాడని అతడి భార్య కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. కంచరపాలెం సాయిరాంనగర్‌లో అల్లంక జ్యోతి, మల్లేశ్వరరావు ప్రేమ వివాహం చేసుకుని నాలుగేళ్లుగా జీవిస్తున్నారు. మల్లేశ్వరరావు ఆశీలమెట్ట వద్ద సీసీ కెమెరా మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా తన భర్త, అత్త కలిసి తనను కులం పేరుతో దూషిస్తున్నారని జ్యోతి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో ఎముకల వ్యాధుల నిపుణుడు డాక్టర్ శరత్‌రామ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మళ్ల అరవిందకుమార్ పాల్గొంటారన్నారు. ఎముకల సంబంధిత వ్యాధులు, సాధారణ వ్యాధులు, గుండె, నేత్ర వైద్య పరీక్షలతోపాటు ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనీ వారు కోరారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని ఒక వ్యక్తి మరణించాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. శుక్రవారం ఉదయం రైల్వే స్టేషన్ 4వ నంబర్ ప్లాట్‌ఫాంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. వయసు సుమారు 40–45 ఏళ్లు ఉండవచ్చు. మృతుడి ఎత్తు సుమారు 5.6 అడుగులు, చామనచాయ రంగులో ఉన్నాడు. ఎరుపు రంగు టీ షర్ట్, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించాడు. జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ బాలాజీరావు కోరారు.

అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి రూ.8 లక్షలు

సింహాచలం దేవస్థానం నుంచి కేటాయింపు

సింహాచలం: పద్మనాభంలోని అనంతపద్మనాభ స్వామి దేవస్థానంలో వచ్చేనెలలో జరిగే దీపోత్సవం నిర్వహణకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో సింహాచలం దేవస్థానం రూ. 8 లక్షలు కేటాయించింది. దీపోత్సవం నిర్వహణకు నిధులు కేటాయించాలని సింహాచలం దేవస్థానం అధికారులకు ఇటీవల ముత్తంశెట్టి విజ్ఞప్తి చేశారు. దీంతో అనంతపద్మనాభస్వామి దేవస్థానం ఈవో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ద్వారా సింహాచలం దేవస్థానం ఈవోకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు ఆ ప్రతిపాదనని పంపారు. ఆ ప్రతిపాదనకు కమిషనర్ ఆమోద ముద్ర వేశారు.

జాబ్‌మేళాలో 131 మంది ఎంపిక


ఎంపికైన అభ్యర్థులతో ఎంప్లాయిమెంట్ అధికారులు సుబ్బిరెడ్డి, శాంతి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. సుమారు 11 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 730 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 354 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 131 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు సుబ్బిరెడ్డి, శాంతిల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలకు ఎంతో కృషి చేస్తోందని వారు అన్నారు.

వెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి


మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

తాటిచెట్లపాలెం: వెలమ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, జనాభా దామాషా పద్ధతిలో అధిక అసెంబ్లీ సీట్లు, పార్లమెంట్ సీట్లు అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. రామాటాకీస్ వద్ద గల సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలమల హక్కులు, ఐక్యత కోసం, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు వెలమలను బీసీ–డీ జాబితా నుంచి ఏ జాబితాలోకి మార్చాలని కోరారు. అన్ని జిల్లాల్లో వెలమ సామాజిక భవనాలకు స్థలాలు కేటాయించాలని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో అన్ని పార్టీలు వెలమలకు అధిక సీట్లు కేటాయించాలన్నారు. తమ ప్రధాన డిమాండ్లతో జనవరి 7న విశాఖ వేదికగా లక్షలాది మందితో వెలమ గర్జన కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు మన్మథరావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, రాష్ట్ర కార్యదర్శి పెదిరెడ్ల శ్రీనివాసరావు, వాదాల దుర్గారావు, ఇత్తంశెట్టి రామునాయుడు, ముద్రు రాము, పట్టా శ్రీధర్, గొల్లు శ్రీనివాస్, రొంగలి చినబాబు, కర్రి రాజేష్, నకిరెడ్డి శివకృష్ణ, కర్రి రామూర్తి నాయుడు, మాకిరెడ్డి సత్యం, గొల్లు రాము తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుడి హక్కులపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాయుడు

మురళీనగర్: వస్తువులను కొని వినియోగించే ప్రతి వ్యక్తికి వాటి నాణ్యతపై ప్రశ్నించే హక్కును వినియోగదారుల హక్కుల చట్టం కల్పిస్తోందని ట్రైనీ టీచర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎన్ఎస్ నాయుడు అన్నారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం హేమలత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన వినియోగదారుల హక్కుల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వస్తు నాణ్యత లోపం వల్ల కలిగే నష్టానికి పరిహారం పొందవచ్చని చెప్పారు. వినియోగదారుల చట్టం, ప్రజలకు కల్పిస్తున్న హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థులతో వినియోగదారుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలుగు టీచర్ హైమావతి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేస్త్రి, ఆటో డ్రైవర్ అదృశ్యం


పలగర మోహన్, మేస్త్రి


ఇమంది అప్పలరాజు, ఆటో డ్రైవర్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మేస్త్రి, ఆటో డ్రైవర్ అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దరి బర్మాక్యాంపులో నివసిస్తున్న పలగర మోహన్ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 18న పనుల నిమిత్తం వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. తెలిసిన వారి ఇళ్లలో ఎంతగా విచారణ చేసినా ఆచూకీ కానరాలేదు. దీంతో అతడి భార్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ సుజయేశ్వరి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కంచరపాలెం పైడిమాంబ కాలనీలో నివసిస్తున్న ఇమంది అప్పలరాజు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 16న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారిని వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో అతడి భార్య ఉష శుక్రవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో పీవీఎల్ నరసింహం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాసంగమం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా శ్రీపూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ పర్యవేక్షణలో అయ్యప్ప మహా సంగమం శుక్రవారం ప్రారంభమైంది. స్థల శుద్ధి, గోపూజలతో మొదటి రోజు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించడానికి విచ్చేసిన మేల్ శాంతిలు, తంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో శ్రీపూర్ణ పుష్కల ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పైలా ఆదిమోహన్‌రెడ్డి, అఖిల భారతీయ అయ్యప్ప ప్రచార సభ అధ్యక్షుడు అయ్యప్ప దాస్, రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు హరిప్రసాద్, అయ్యప్ప మహాసంగమం పూజా కోర్ కమిటీ చైర్మన్ ఎం.కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరెడ్డి, పూజా కమిటీ చైర్మన్ ఆదిమూలపు నాగరాజు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తోనే సుపరిపాలన

- అందుకే ఆయనను గెలిపించుకోవాలి
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 47, 48, 54, 26 వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్...'



47వ వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు


54వ వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న కె.కె రాజు


26వ వార్డులో సచివాలయం వద్ద పథకాల బోర్డును ప్రారంభిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల సుపరిపాలనలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 47వ వార్డు అంబేడ్కర్ ఎస్టేట్, 54వ వార్డు రవీంద్రనగర్, 48వ వార్డు ఇందిరానగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్లు, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు కె.కామేశ్వరి, సిహెచ్.రజినీ, క్లస్టర్ ఇన్‌చార్జి నీలి రవి నేతృత్వంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయా సచివాలయాల్లో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డులను, అనంతరం పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో అర్హులైన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వతాతలకు పారదర్శకంగా లంచాలకు, వివక్షతకు తావులేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పథకాల ద్వారా అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూరుతోందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ పాలన.. నేటి జగనన్న సుపరిపాలనల మధ్య వ్యత్యాసం చూసుకోవాలన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల ఇన్‌చార్జి కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కృష్ణారావు, ఏపీడీ పద్మావతి, దుర్గాప్రసాద్, వి.అప్పారావు, సుకుమార్, వి.జయ, బి.రాఘవులు, సురేష్, కృపా, రమణ, పద్మ, శ్రీరామ్, హసీనా బేగం, గోపి, చిరంజీవి, రమణమ్మ, శంకర్, శ్రీను, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, సీవోలు, ఆర్పీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 26వ వార్డులో 125 సచివాలయం పరిధి శాంతిపురం లాల్‌బహాదూర్ శాస్త్రి పార్క్ వద్ద వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు హాజరై మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగనమోహనరెడ్డితోనే సాధ్యమన్నారు. అందుకే ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందని చెప్పారు. జగనన్న విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, ఏపీడీ దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌బీఏ గుర్తింపునకు సిద్ధం కండి

- ఓఎస్డీ డీవీఎస్ఎస్ ప్రసాద్


మాట్లాడుతున్న ఓఎస్డీ ప్రసాద్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లోని వివిధ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపునకు సంబంధించి టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎన్‌బీఏ రివ్యూ అధికారి, ఓఎస్డీ డీవీఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం సమీక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమీక్షలో ఆయన ఎన్‌బీఏ గుర్తింపు సాధించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. ఇక్కడి సౌకర్యాలు, మౌలిక వసతులు, ప్రయోగశాలలు, తదితర అంశాలను ఎన్‌బీఏ అధికారుల బృందం పరిశీలిస్తుందని తెలిపారు. వారు కేటాయించిన మార్కుల ఆధారంగా 3 నుంచి 6 సంవత్సరాల ఎన్‌బీఏ గుర్తింపు వస్తుందన్నారు. గైస్‌లో సౌకర్యాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుతం గైస్‌లో కెమికల్ ఇంజినీరింగ్, పెట్రో కెమికల్స్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపునకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఎన్‌బీఏ విభాగానికి పంపామని, బృంద సభ్యుల పరిశీలన కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఈ రెండు విభాగాలకు ఆరేళ్ల ఎన్‌బీఏ గుర్తింపు వస్తే.. తన తరపున ప్రోత్సాహకంగా రూ.లక్షలు ఇస్తానని ప్రకటించారు. డిపార్ట్‌మెంట్ హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, ఎస్.ప్రశాంతకుమారి, సీనియర్ అధ్యాపకులు కేబీవీవీఎస్ కుమార్, విజయలక్ష్మి, ఎల్.గీతిక, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం



కరాటే పోటీలు ప్రారంభిస్తున్న అతిథులు

విశాఖ స్పోర్ట్స్: డబ్ల్యూకేఐ కరాటే పోటీలను రాజ్యసభ ఎంపీ జీ.వీ.ఎల్. నరసింహారావు శుక్రవారం ప్రారంభించారు. పోర్ట్ స్టేడియంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కాటా, కుమిటీ పోటీలు నిర్వహించనున్నారు. తొలుత జీవీఎల్‌తో పాటు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, నిర్వాహక కమిటీ ప్రతినిధులు బేరీ విల్కిన్సన్, కరణంరెడ్డి నరసింగరావు, కాశీవిశ్వనాథ్, పేడాడ రమణికుమారి తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బెలూన్లు గాల్లోకి విడిచారు.